

ఇంటెలిజెన్స్ ఆరా!
టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో జరిగిన సబ్ ఇంజనీర్ (ఎస్ఈ)ల రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు. అవకతవకలపై ఇంటెలిజెన్స్ ఆరా తీస్తోంది. - 8లో▸



కాజీపేట జంక్షన్‌లో అగ్నిప్రమాదం
కాజీపేట జంక్షన్‌లోని రైల్వే యార్డులో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. నిలిపి ఉన్న రైలు బోగి దగ్ధమైంది. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$37^0/23^0$
వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండతో పాటు ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మహిళల సంక్షేమానికి కృషిచేయాలి

● అదనపు కలెక్టర్ అశ్వినితానాజీవాకడే



ఖిలా వరంగల్: మహిళలు పరస్పర సహాయ, సహకారాలు అందించుకుంటూ, మహిళల సంక్షేమానికి మరింత కృషి చేయాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో టీఎన్జీఓఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ మహిళలు ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులు ఒత్తిడిని అధిగమించాలని పేర్కొన్నారు. టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ మాట్లాడుతూ టీఎన్జీఓ సంఘం మహిళా ఉద్యోగులకు అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీడబ్ల్యూఓ శారద, డాక్టర్ పి.రజిని, డాక్టర్ మమతారెడ్డి, గాజె వేణుగోపాల్, హేమానాయక్, పాలకుర్తి సదానందం, యాకయ్య, రమాదేవి, జ్యోతి, రజిత, సునీత, నాయర్, సుశీల, మానస, మేఘన, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సు పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: జిల్లా పరిధిలోని శంభునిపేట దూపకుంట రోడ్డులోని వరంగల్ (బాలికలు-2)మైనార్టీ గురుకులంలో ఖాళీగా ఉన్న ఔట్‌సోర్సింగ్ స్టాఫ్ నర్స్ పోస్టు(1)భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సనా సెక్యూరిటీ అండ్ ప్లేస్‌మెంట్ ఏజెన్సీ నిర్వాహకుడు హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లాలోని అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తులు ఈనెల 9వతేదీ సాయంత్రం 4 గంటల్లోపు కాకతీయ యూనివర్సిటీ క్రాస్ రోడ్డులోని పాత ఆర్టీఏ కార్యాలయం, నయీంనగర్, హనుమకొండ వద్ద గల తమ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 83176 47072 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



చెన్నారావుపేట: షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన ఘటన లింగగిరి గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శివరాత్రి సమ్మయ్య ఆకుకూరలు పండించి విక్రయిస్తాడు. రోజు మాదిరిగానే తన గుడిసెలో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రకు ఉపక్రమించాడు. మంగళవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే లేచి అరువగా చుట్టుపక్కల వారు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైర్ ఇంజన్ వచ్చినప్పటికీ అప్పటికే ఇంటిలో ఉన్న నగదు రూ.2.3 లక్షలు, బీరువా, మంచాలు, దుస్తులు, ఏడు క్వింటాళ్ల బియ్యం, ఇతర వస్తువులు మొత్తం కాలిపోయాయి. ఇల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన సమ్మయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే నాగరాజు



వర్ధన్నపేట: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. వర్ధన్నపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు మంగళవారం సబ్సిడీ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. లబ్ధిదారులు చిన్న చిన్న వ్యాపారాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం ఇల్లంద గ్రామంలో గృహజ్యోతి పథకానికి సంబంధించిన జీరో విద్యుత్ బిల్లులను అందజేసి మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లే కార్యక్రమం పెట్టుకున్నాయని, వాటిని తిప్పికొడుతూ ప్రజలకు మేలు కలిగే విధంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. నాయకులు అబ్బిడి రాజిరెడ్డి, ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న, కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇక ఎరువుల లెక్క పక్కా..

నిల్వల్లో తేడా, కొరతకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- అందుబాటులోకి ‘ఫర్టిలైజర్ ఇన్‌వెంటరీ వెరిఫికేషన్ సిస్టమ్’ యాప్
- వారానికి రెండు రోజులపాటు ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు
- డీలర్లు ఈపాస్ యంత్రం ద్వారా విక్రయించేలా చర్యలు
- జిల్లాలో 460 ప్రైవేట్, పీఏసీఎలు, ఓడీసీఎంఎస్‌ల దుకాణాలు



సంగెంలోని ఓ షాపులో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న డీఏఓ ఉషాదయాళ్, ఏఓ

సంగెం: ఎరువుల తనిఖీ విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. నిల్వల్లో తేడాలు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ‘ఫర్టిలైజర్ ఇన్‌వెంటరీ వెరిఫికేషన్ సిస్టం’ (ఫైవ్) పేరిట కొత్త యాప్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎరువుల కొరతకు చెక్ పెట్టడమే కాకుండా నిల్వలపై ఎప్పటికప్పుడు అధికారులు నిఘా ఉంచేందుకు ఇది తోడ్పడనుంది. తనిఖీల్లో గుర్తించిన అంశాలను అధికారులు ఈ యాప్‌లోనే నమోదు చేయాల్సి ఉంటుంది. కాగా, జిల్లాలో ప్రైవేట్, ఏపీసీఎస్‌లు, ఓడీసీఎంఎస్‌లకు సంబంధించినవి 460 ఫర్టిలైజర్ షాపులు ఉన్నాయి.

పక్కదారి పట్టకుండా..

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రైతులకు రాయితీపై ఎరువులను అందిస్తోంది. రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఈ క్రమంలో పారదర్శకతను మరింత పెంచేందుకు పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) విధానంలో రైతులకు ఎరువులు విక్రయిస్తున్నారు. ఈ విధానంలో రైతులు తమ ఆధార్‌కార్డు, పాస్‌బుక్ సమర్పించాల్సి ఉంటుంది. రైతులు ఆధార్‌కార్డులు, పాస్ పుస్తకాలు తీసుకురాకపోవడంతో ఎరువుల షాపుల యజమానులు పీఓఎస్ మిషన్లలో సమగ్రంగా వివరాలు నమోదు చేయడం లేదు. వాస్తవంగా షాపుల్లో యూరియా, డీఏపీ తదితర ఎరువుల నిల్వలు ఉండవు. కానీ, ఈ పాస్ మిషన్‌లో స్టాకు ఉన్నట్లు ఉంటుంది. దీంతో కచ్చితమైన నిల్వల వివరాలు తెలుసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకుచొచ్చింది. ప్రైవేట్ ఎరువుల డీలర్లతోపాటు టీఎస్ ఆగ్రోస్, మార్క్‌ఫెడ్ వంటి ఎరువుల పంపిణీ సంస్థలు, ప్రైవేట్ ఎరువుల వ్యాపారులు, పీఏసీఎస్‌లు, ఓడీసీఎంఎస్‌లు, పీఏసీఎస్‌ల్లో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

సమగ్ర వివరాలు యాప్‌లో..

ఎరువులను అధికారులు ధ్రువీకరించడంతోపాటు నిల్వలు, విక్రయాలు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అనేది ఈ యాప్ ద్వారా జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ), డివిజన్ సహాయ సంచాలకులు (ఏడీఏ), మండల వ్యవసాయాధికారి (ఏఓ) ఈ యాప్‌ను వినియోగించి తనిఖీలు నిర్వహిస్తున్నారు. అధికారులు ఆన్‌లైన్‌లో నిర్దేశించిన షాపునకు వెళ్లి యాప్ ఓపెన్ చేస్తే ఆ దుకాణంలో ఎరువుల వివరాలు లభిస్తాయి. ఈ పాస్ యంత్రంలో చూపించే నిల్వలతో సమానంగా స్టాక్ రిజిస్టర్, షాపులో గ్రౌండ్ బ్యాలెన్స్ సమానంగా ఉండాలి. విక్రయించిన రైతుల వివరాలతోపాటు స్టాక్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి వాటిని ఫొటో తీసి యాప్‌లో నమోదు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా స్టాక్ బుక్, నిల్వలను పరిశీలించి తేడా ఉన్నట్లు గమనిస్తే చర్యలు తీసుకోవచ్చు. సమగ్ర వివరాలు ఎప్పటికప్పుడు రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయానికి చేరుతుండడంతో జిల్లాలో ఎరువుల నిలవలు, అవసరమైన ఎరువుల వివరాలు తెలుసుకోవడం సులభతరం అవుతున్నది.



షాపులో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

వారంలో రెండుసార్లు..

మండల వ్యవసాయాధికారులు, సహాయ సంచాలకులు, వారానికి రెండుసార్లు 10 ఎరువుల షాపుల్లో తప్పకుండా తనిఖీలు చేయాల్సి ఉంటుంది. అలాగే, జిల్లా వ్యవసాయాధికారి కూడా ఈ సార్లు ఐదు దుకాణాలను తనిఖీ చేయాలి.

తీరనున్న ఎరువుల కొరత

కొత్తగా వచ్చిన యాప్ ద్వారా ఎరువుల షాపుల్లో ఉండే నిల్వల వివరాలు ఎప్పటికప్పుడు అధికారులు తెలుసుకునే వీలుంటుంది. ఎరువుల నిల్వలపై కచ్చితమైన లెక్కలు ప్రభుత్వం వద్ద ఉంటాయి. సరిపడా నిల్వలు లేకపోతే వెంటనే సరఫరాకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఇక కృత్రిమ కొరత సృష్టించే ఆస్కారం ఉండదు. దీంతో రైతులకు ఎరువులు లేవనే సమస్య ఉండదు.

మరింత పారదర్శకత



కొత్త యాప్ ద్వారా ఎరువుల విక్రయాల్లో మరింత పారదర్శకత పెరుగుతుంది. నిల్వలపై ప్రభుత్వం వద్ద సమాచారం ఉంటుంది. కృత్రిమ కొరతకు అవకాశం ఉండదు. దీంతో ఎరువుల కొరత అనే సమస్య ఉత్పన్నం కాదు.

\- చాట్ల యాకయ్య, ఏఓ సంగెం

నిల్వల్లో తేడా ఉంటే చర్యలు



ఎరువుల నిల్వల్లో తేడాలు లేకుండా ఉండేందుకు ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చింది. షాపుల్లో తనిఖీ చేసి తేడాలు ఉంటే ప్రత్యేక యాప్ ద్వారా గుర్తించవచ్చు. దీంతో ఎరువుల షాపుల నిర్వహణలో లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు గుర్తించే అవకాశం ఉంది. ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువుల విక్రయాలు చేపట్టాలి. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాల్లో ఎరువులను విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

\- ఉషాదయాళ్, జిల్లా వ్యవసాయాధికారి

అర్హులందరికీ ‘గ్యారంటీ’ పథకాలు

● వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్య



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదుపై మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి గ్యారంటీ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపాలిటీల్లో అవసరం మేరకు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు వివరాలు, గ్యాస్ కనెక్షన్ నంబర్, విద్యుత్ మీటరు నంబర్ వివరాలు లింక్ ఉన్న దరఖాస్తులకు ఇప్పటికే ప్రభుత్వం రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో బిల్లులు పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాలు, జీడబ్ల్యూఎంసీ పరిధిలో ఏర్పాటు చేసే 12 సేవా కేంద్రాల్లో దరఖాస్తుల్లోని తప్పులను సవరించుకోవాలని కోరారు. లబ్ధిదారులు తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నంబర్, విద్యుత్ మీటరు నంబర్ వివరాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజాపాలన కేంద్రాల్లో వినియోగించే సాఫ్ట్‌వేర్ పనితీరును క్షేత్రస్థాయి సిబ్బందికి సంపూర్ణంగా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్వినితానాజీవాకడే, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి శివప్రసాద్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కేంద్రాలపై వీడియో కాన్ఫరెన్స్..

ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా అందించే సేవలపై మంగళవారం రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఏఎం రిజ్వీ, సివిల్ సప్లయ్ కమిషనర్ డీఎస్ చౌహాన్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, సీజీజీ డీజీ రాంజేంద్రనిమ్ము వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలని కోరారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు పూర్తిచేయాలి

వరంగల్‌లో చేపట్టిన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి నిర్మాణ పనుల పురోగతిపై డీఎంఈ డాక్టర్ ఎన్.వాణితో కలిసి కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో అదనపు డీఎంఈ శివరాంప్రసాద్, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, ఎంజీఎం, కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, మోహన్‌దాస్, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగేంద్ర, ఈఈ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పశుసంపదను కాపాడుకోవాలి



పశువుకు చికిత్స చేస్తున్న వైద్యులు

వర్ధన్నపేట: పాడి రైతులు పశుసంపదను కాపాడుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ వి.రఘుబాబు సూచించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పాడిపశువులకు గర్భకోశ వ్యాధులు, ఎదకు రాని పశువులకు చూడి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 45 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. పశువైద్యాధికారి రాజేందర్, పీవీ. నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ డాక్టర్ రాజశ్రీ, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాజేశ్వర్‌రావు, సూదగోని గోపాల్, ఎం.సంపత్, ఎం.రజిత, రమేష్, పశువైద్య సిబ్బంది సాయిరాం, ఐలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి




తిర్మలాయపల్లి కేజీబీవీలో విద్యార్థినులకు ఆటవస్తువులు అందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి: ప్రజాపాలన దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్ చేసి అర్హులకు పథకాలను అందించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మరింత సేవ చేసేందుకే ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం నాలుగు పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు చేరుతాయని, ఎవరూ అధైర్యపడొద్దని కోరారు. అన్ని విధాలుగా పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, ఎంపీడీఓ కిషన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి..

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కోరారు. 10 మందికి సేవ చేసే గుణాన్ని కలిగి ఉండాలని పేర్కొన్నారు. తిర్మలాయపల్లిలోని కేజీబీవీకి తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో సోలార్ ఫెన్సింగ్, హీట్‌వాటర్ మిషన్, వాటర్‌ప్లాంట్ మరమ్మతు, ల్యాప్‌టాప్‌లు, క్రీడా పరికరాలను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థినులు పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, గ్రామ స్పెషలాఫీసర్ గుమ్మడి వీరభద్రం, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇండియా ప్రెసిడెంట్ మట్ట రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ చింతలపాని మురళి, పాఠశాల స్పెషలాఫీసర్ బుర్ర కవిత, ఉపాధ్యాయులు ప్రమీల, స్వరూప, విజయ, శైలజ, సంధ్యారాణి, జ్యోత్స్న, స్రవంతి, ఎస్.శైలజ, శ్రావణి, స్నేహలత, స్వప్న, రజిని, జ్యోతి, పద్మ, కనకలక్ష్మి, మండల నాయకులు ముద్రబోయిన వెంకన్న, లక్ష్మీనారాయణ, కృష్ణమాచార్యులు, రత్నాకర్ రెడ్డి, దోమల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న నాటిక ప్రదర్శన



‘హక్కు’ నాటికలోని ఓ సన్నివేశం

వర్ధన్నపేట : వర్ధన్నపేటలోని భారతీయ నాటక కళాసమితి స్వర్ణోత్సవాల్లో భాగంగా మంగళవారం నాటికల ప్రదర్శనలను స్థానిక తహసీల్దార్ విజయ సాగర్, ఎంపీడీఓ వెంకటరమణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాత్రి 9 గంటలకు సిరిసిరిమువ్వ కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి ‘హక్కు’ నాటిక మొదటి ప్రదర్శన వేశారు. ఇందులో ఇతివృత్తం దేశ, కాలమాన సంస్కృతీసంప్రదాయం అన్న విషయాలను పట్టించుకోకుండా మంచి, చెడులను దురాలోచన చేయకుండా పటిష్ఠంగా నిర్మించిన చట్టాల వల్ల కూలిపోతున్న సమాజాలు, కుటుంబాలు మధ్య జరుగుతున్న గొడవలకు పరిష్కారంగా ‘హక్కు’ నాటిక ప్రదర్శన నిలిచింది. రెండో నాటిక రాత్రి 10 గంటలకు మురళీ కళానిలయం హైదరాబాద్ వారి ‘అవ్వా అప్పచ్చి’. నాటిక ఇతివృత్తం ఆఫీస్‌లో సిబ్బందిని అదుపులో పెట్టిన పైఅధికారి భార్య మాటకు ఎదురు చెప్పలేని పరిస్థితి.. తన వద్ద పనిచేసే గుమస్తా తన ఇంటి పక్కన అద్దెకు దిగుతాడు. ఆ తర్వాత భార్యపై అథారిటీ చెలాయించేది చూసి, తాను కూడా భార్యను ఎలా అథారిటీ చేయాలని పై అధికారి గుమస్తాను సలహా అడుగుతాడు. పసిగట్టిన అధికారి భార్య, అతని మామ దానిని తిప్పి కొట్టి ఇద్దరికి బుద్ధి చెప్పడంతో కథ సుఖాంతమవుతోంది. ఒకరిని చూసి చేయాలనేది కాదు తన ఆలోచనతోనే మార్పు తీసుకురావాలనే ఇతివృత్తంతో చక్కని హాస్య సన్నివేశాలతో ప్రేక్షకులను అలరించింది.

ఒక్కొక్కరుగా హస్తం బాట!

ఉద్యమ జిల్లాలో బీఆర్ఎస్‌ను వీడుతున్న నేతలు

- ఇప్పటికే పార్టీకి ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు దూరం.. అదే దారిలో మరో ఇద్దరు..?
- కాంగ్రెస్ వైపు మేయర్ సుధారాణి..? సీఎం రేవంత్‌ను కలవడంతో ప్రచారం..
- కాంగ్రెస్‌లోకి పరకాల, తొర్రూరు మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు.. పలువురు జెడ్పీటీసీలు, సీనియర్లు..
- చర్చనీయాంశంగా మారిన పార్టీ ఫిరాయింపులు



హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న గ్రేటర్ వరంగల్ బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉద్యమాల ఖిల్లా.. ఓరుగల్లులో బీఆర్ఎస్‌కు షాక్ మీద షాక్ తగులుతోంది. అసెంబ్లీ ఎన్నికల నుంచి మొదలైన అసంతృప్తి పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బయటపడుతోంది. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, సీనియర్ నాయకులు ఒక్కరొక్కరుగా పార్టీని వీడుతుండటం రాజకీయ విశ్లేషకుల్లో చర్చనీయాంశం అవుతోంది. స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, రైతుబంధు సమితి మాజీ చైర్మన్ డాక్టర్ తాటికొండ రాజయ్యతో మొదలైన రాజీనామాల పరంపర ఊపందుకుంది. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్, బీజేపీలో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు గెలుపు ధీమాతో ఉన్న నాయకులు ఓటమిని చవిచూడటంతో నైరాశ్యంలో పడిన ద్వితీయ శ్రేణి క్యాడర్ కూడా పార్టీని వీడుతోంది. ఉద్యమ జిల్లా ఓరుగల్లులో బీఆర్ఎస్‌కు దెబ్బమీద దెబ్బ తగులుతోంది.

కాంగ్రెస్‌లోకి గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి..?

గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి కూడా బీఆర్ఎస్‌ను వీడనున్నారన్న ప్రచారం జోరందుకుంది. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన 12 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆదివారం హైదరాబాద్‌లో సీఎం, ముఖ్యనేతలను కలిశారు. విషయం తెలుసుకున్న వరంగల్ మేయర్ గుండు సుధారాణి తన కుమారుడు గుండు విజయ్‌రాజ్‌తో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ నేపథ్యంలో ఆమె కూడా పదవిని పదిలపర్చుకునే క్రమంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరవచ్చన్న చర్చ జరుగుతోంది.

తాజాగా మంగళవారం వరంగల్ తూర్పు నియోజక వర్గానికి చెందిన 10 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాద్‌లో రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

- అదేవిధంగా పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత, తొమ్మిది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. పార్టీ మారకపోతే పరకాల వైస్ చైర్మన్ రేగూరి జయపాల్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టే యోచనలో ఉన్నారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల జెడ్పీటీసీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పులి తిరుపతిరెడ్డి పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్, పార్టీ జేఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతికి రాజీనామా లేఖ అందించారు. ఆయనతో పాటు ఎనిమిది మంది సర్పంచ్‌లు, నాయకులతో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మరో ఎనిమిది మున్సిపాలిటీల్లో చైర్మన్లను దింపేందుకు ముసలం మొదలు కాగా.. వారు సైతం కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు టచ్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్‌లోకి తొర్రూరు మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు!

తొర్రూరు : తొర్రూరు మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగ సురేందర్ రెడ్డి, 10వ వార్డు కౌన్సిలర్ దొంగరి శంకర్, 16వ వార్డు కౌన్సిలర్ బిజ్జాల మాధవి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు వారు మంగళవారం హైదరాబాద్‌కు పయనమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు వెళ్లినట్లు తెలిసింది. సీఎం అపాయింట్‌మెంట్ దొరకకపోవడంతో చేరిక కోసం వేచి చూస్తున్నట్లు సమాచారం. తొర్రూరు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరనున్న సమాచారం అందుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆ పార్టీ కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. వారిపై అవిశ్వాసం పెట్టి తొలగించాలని నిర్ణయించినట్లు తెలిసింది. కౌన్సిలర్లతో మాట్లాడిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఈ వ్యవహారంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యేల దారిలో మరో ఇద్దరు..

ఫిబ్రవరి 3న స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ పదవులకు రాజీనామా చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ టికెట్ ఇవ్వకపోయినా జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసినా కనీస గుర్తింపు లేదని, ఆరు నెలలు మానసిక వేదనకు గురై పార్టీని వీడుతున్నట్లు కేసీఆర్‌కు పంపిన రాజీనామా లేఖలో డాక్టర్ రాజయ్య స్పష్టం చేశారు. ఇది జరిగిన నెల రోజుల్లోనే వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ ఆ పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారని తీవ్ర చర్చ జరిగింది. శనివారం నుంచి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న ఆయన ఆదివారం హైదరాబాద్‌లో కీలక బీజేపీ నేతలను కలిసినట్లు ప్రచారం జరుగుతుండగా.. బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరుతున్నట్లు వార్తలు వచ్చాయి. అధిష్టానం ఆదేశం మేరకు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య.. అరూరి రమేష్‌తో నెరిపిన దౌత్యం ఫలించకపోగా.. రమేష్ బీజేపీ అగ్రనేతలకు టచ్‌లో ఉన్నాడని, త్వరలోనే ఆ పార్టీలో చేరతారన్న ప్రచారం జోరందుకుంది. దీనిపై ఆయన మంగళవారం స్పందించి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. తాను బీఆర్ఎస్‌ను వీడిపోవడం లేదని స్పష్టం చేశారు. కాగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మరో ఇద్దరు కీలక మాజీ ప్రజాప్రతినిధులు కూడా త్వరలోనే బీఆర్ఎస్ పార్టీని వీడవచ్చన్న ప్రచారం జరుగుతోంది.

క్లుప్తంగా

ఇంటర్ యూనివర్సిటీ సైక్లింగ్ పోటీలు



సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో అంతర్ కళాశాలల (ఇంటర్ యూనివర్సిటీ)సైక్లింగ్ పోటీలు(మెన్) నిర్వహించారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఆచార్య వై.వెంకయ్యతో కలిసి మంగళవారం సైక్లింగ్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. కేయూనుంచి హుజూరాబాద్ వరకు అక్కడి నుంచి కేయూ వరకు(50 కిలోమీటర్లు) ఈ సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. త్వరలో జరుగబోయే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సైక్లింగ్ పోటీలకు ఐదుగురిని ఎంపిక చేసినట్లు వెంకయ్య తెలిపారు. అందులో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి మహ్మద్ హబీబుద్దీన్, వరంగల్ కిట్స్ కళాశాల నుంచి జె.సంజీవ్, బి.మహేష్‌బాబు, ఎం.జశ్వంత్, హనుమకొండలోని మాస్టర్జీ డిగ్రీ కళాశాల నుంచి మహ్మద్ రియాజ్ ఉన్నారని తెలిపారు.

ఆరో రోజు రూ.1.46కోట్లు

హన్మకొండ కల్చరల్: మేడారం సమ్మక్క సారలమ్మ జాతర హుండీల లెక్కింపు కొనసాగుతోంది. హనుమకొండ టీటీడీ కల్యాణమండలంలో మంగళవారం ఉదయం 59 ఐరన్ హుండీలను విప్పి లెక్కింపు జరుపగా ఆరో రోజు రూ. 1,46,09,280 ఆదాయం లభించింది. మొత్తం 540 హుండీల్లో రూ.12,71,79,280లు నమోదు అయిందని, వాటిని బ్యాంకులో జమ చేశామని ఈఓ రాజేంద్రం తెలిపారు. అలాగే 779 గ్రాముల 800 మిల్లీ గ్రాముల బంగారం, 55.150 కేజీల వెండి లభించిందన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

ఎస్ఈల రిక్రూట్‌మెంట్‌పై

ఇంటెలిజెన్స్ ఆరా!

అవకతవకలు జరిగాయని ప్రజాపాలనలో ఫిర్యాదు

- కోర్టును ఆశ్రయించిన అభ్యర్థులు
- టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు



హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో జరిగిన సబ్ ఇంజనీర్ (ఎస్ఈ)ల రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు, అవకతవకలపై ఇంటెలిజెన్స్ ఆరా తీస్తుంది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు పోస్టులు భర్తీ చేయకుండా అక్రమాలకు పాల్పడ్డారని అర్హత సాధించి, కాల్ లెటర్ అందుకుని అవకాశం కోల్పోయిన అభ్యర్థులు హైదరాబాద్ ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో వినతి పత్రం అందించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సబ్ ఇంజనీర్ల పోస్టుల భర్తీలో తమకు అన్యాయం జరిగిందని, తమకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు. ఈ నియామకాలపై ఇంటెలిజెన్స్ అధికారులు విచారణ చేపట్టి అవకతవకలు, అక్రమాలపై కూపీ లాగుతున్నట్లు విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాల్ లెటర్‌లు పొందిన తమను విధుల్లోకి తీసుకోవాలని అభ్యర్థులు టీఎస్ ఎన్పీడీసీఎల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

70 పోస్టులు తగ్గించారు..

టీఎస్ ఎన్పీడీసీఎల్ 497 సబ్ ఇంజనీర్‌ల పోస్టుల భర్తీకి 2018 మే 24న నోటిఫికేషన్ జారీ చేశారు. అదే ఏడాది జూలై 8న రాత పరీక్ష నిర్వహించారు. ఆగస్టు 31న ఫలితాలు ప్రకటించారు. పోస్టుకు ఒక్కరు చొప్పున మెరిట్ ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సెప్టెంబర్ మాసంలో పూర్వ సర్కిల్ వారీగా వేర్వేరు తేదీల్లో కాల్ లెటర్ పంపించారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు 497 మందికి కాకుండా 427 మందికి మాత్రమే కాల్ లెటర్ పంపారు. అంటే ఇక్కడ 70 పోస్టులు తగ్గించారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా నియామక ప్రక్రియ నిలిపివేశారు. అధికారులను సంప్రదించగా ఎన్నికల కోడ్ అనంతరం నియామకాలు చేపడుతామని చెప్పారని అభ్యర్థులు తెలిపారు. ఎన్నిక కోడ్ ఎత్తివేశాక 2018 డిసెంబర్‌లో పూర్వ సర్కిల్‌ల వారీగా మరోసారి సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలని కాల్ లెటర్ పంపారని తెలిపారు. అయితే ఈ సమయంలో మరో 24 పోస్టులు తగ్గించారని అర్హులైన అభ్యర్థులు తెలిపారు. గతంలో కాల్ లెటర్ అందుకుని రెండోసారి కాల్‌లెటర్ అందుకోని అభ్యర్థులు వెంటనే హైకోర్టును ఆశ్రయించగా అంతకు ముందు కాల్‌లెటర్ జారీ చేసిన వారందరికీ తిరిగి జారీ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు అధికారులు 427 మందికి కాల్‌లెటర్ పంపి, 403 మందికి నియామక పత్రాలు అందించి కోర్టు ఆదేశాలతో కాల్ లెటర్ పొందిన 24 మంది అభ్యర్థులను పక్కన పెట్టారు. తాము ఈ విషయమై అధికారులను సంప్రదిస్తే కోర్టు కాల్ లెటల్ మాత్రమే జారీ చేయమని చెప్పిందని, నియామకం చేయాలని చెప్పలేదని తప్పించుకున్నారని అభ్యర్థులు వాపోయారు. ఆ తర్వాత అప్పటి సీఎండీ, పాలక వర్గానికి తమ బాధలు చెప్పుకుందామని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయానికి వస్తే తమను గేట్ బయట నుంచి పంపించారని అభ్యర్థులు రోదించారు. కనీసం తమకు సీఎండీ, డైరెక్టర్లను కలిసే అవకాశం కూడా కల్పించకుండా వేధించారని వాపోయారు. దీంతో తాము మరోసారి హైకోర్టును ఆశ్రయించామని, ప్రస్తుతం హైకోర్టులో విచారణ జరుగుతుందని అభ్యర్థులు తెలిపారు.

అర్హత సాధించిన అభ్యర్థులతోనే భర్తీ చేయాలి..

అభ్యర్థులు నోటిఫికేషన్‌లో ప్రకటించిన పోస్టులన్నీ రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులతోనే భర్తీ చేయాలని కోరుతున్నారు. సబ్ ఇంజనీర్‌కు ఎంపికయ్యామని బావించి కొందరు అంతకు ముందు పని చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఉన్న ఉద్యోగం పోయి, వస్తదని అనుకున్న ఉద్యోగం రాక ఆర్థికంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. టీఎస్ ఎన్పీడీసీఎల్‌కు నూతనంగా కర్నాటి వరుణ్ రెడ్డిని సీఎండీగా నియమించిన తర్వాత తాము రెండు సార్లు కలువగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారని అభ్యర్థులు తెలిపారు. ఈ ప్రభుత్వంలో ప్రస్తుతం సీఎండీ ద్వారా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు అభ్యర్థులు తెలిపారు.

ఇన్ సర్వీస్ వారితో భర్తీ..

సబ్ ఇంజనీర్ల నోటిఫికేషన్‌లో పేర్కొన్న 497 పోస్టులను నిబంధనల మేరకు పూర్తిగా అర్హులైన అభ్యర్థులచే భర్తీ చేయాల్సి ఉండగా, పోస్టులు తగ్గించి, జేఎల్ఎంలుగా పని చేస్తున్న వారికి పదోన్నతులు కల్పించి నిబంధనలకు విరుద్ధంగా ఇన్ సర్వీస్ వారితో భర్తీ చేశారని సమాచారం. దీంతో పాటు లోకల్, నాన్ లోకల్ అంశంలో తప్పుడు రోస్టర్ విధానం అనుసరించి టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని వారిని కాకుండా ఎస్పీడీసీఎల్ పరిధిలోని జిల్లాలకు చెందిన అభ్యర్థులచే భర్తీ చేశారని, ఇక్కడ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియామకాల విభాగం చూసే అధికారిగా నిబంధనల మేరకు నడుచుకునేలా పాలక వర్గానికి సహకరించాల్సిన ఈ అధికారి నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి బోర్డు అప్రూవల్ లేకుండా పోస్టులు తగ్గించడంలో కీలకంగా వ్యవహరించారని ప్రచారం సాగుతోంది.

ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, మైనార్టీ స్టడీ సర్కిల్, హైదరాబాద్ ఆధ్వర్యంలో గ్రూప్–1 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న మైనార్టీ అభ్యర్థులు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, పార్శిలు) పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు వీలుగా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మేన శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అర్హులైన మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉచిత శిక్షణను 45 రోజుల పాటు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు హనుమకొండ సుబేదారిలోని కలెక్టరేట్ కాంప్లెక్స్ 2వ అంతస్తులోని కార్యాలయంలో ఈనెల 22 తేదీలోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 7330990322 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో..

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులా అభివృద్ధి సంస్థ జిల్లా అధికారిణి నిర్మల, ఎస్సీ స్టడీ సర్కిల్ వరంగల్ గౌరవ సంచాలకులు డాక్టర్ కె.జగన్‌మోహన్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులు రాష్ట్ర ప్రభుత్వ షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 5 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. అర్హులైన వారు ఈనెల 6వ తేదీలోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌స్టడీసర్కిల్.కో.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 10న హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశపరీక్షను నిర్వహిస్తారన్నారు. ఈ శిక్షణ కాలంలో రాష్ట్ర స్థాయి పోటీపరీక్షలతోపాటు ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తదితర ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, వసతి ఉంటుందన్నారు.

అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు

- గ్యాస్ పొయ్యిపై కోడలి చేతులు కాల్చిన అత్తమామ
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



గాయాలను చూపుతున్న నాగరాణి

దుగ్గొండి: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామ కోడలిని వేధింపులకు గురి చేశారు. కోడలి చేతులను గ్యాస్ పొయ్యిపై కాల్చడంతో తీవ్ర గాయాల పాలైన బాధితురాలు మంగళవారం దుగ్గొండి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన అడప కోమలి–బుచ్చయ్య దంపతుల కూతురు నాగరాణిని నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామానికి చెందిన జల్లి శారద –బుచ్చయ్య దంపతుల కుమారుడు నరేష్‌కు ఇచ్చి 2007 మార్చి నెలలో వివాహం చేశారు. పెళ్లి సమయంలో ఎకరన్నర భూమి, 15 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు చెల్లించారు. కొన్ని రోజుల పాటు సాఫీగా సాగిన సంసారంలో అదనపు కట్నం కోసం వేధింపులు మొదలయ్యాయి. దీంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈ నెల 4న తనకు రూ. 40 లక్షలు కావాలని, మీ పుట్టింటి నుంచి తీసుకురావాలని గొడవ చేసి చేయిచేసుకున్నాడు. విషయాన్ని నాగరాణి తన తల్లిదండ్రులకు తెలపడంతో ఆగ్రహించిన అత్తమామ, భర్త కలిసి నాగరాణిని బలవంతంగా గ్యాస్ స్టవ్ వద్దకు తీసుకెళ్లి చేతులను గ్యాస్‌పై ఉంచి బొబ్బలు వచ్చేలా కాల్చారు. విషయం తెలుసుకున్న నాగరాణి కుటుంబ సభ్యులు దీక్షకుంటకు రాగానే నరేష్‌తోపాటు ఆయన తల్లిదండ్రులు నాగరాణి కుటుంబ సభ్యులను కొట్టి గాయపరిచారు. దీంతో నాగరాణి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేష్ తెలిపారు. చికిత్స నిమిత్తం నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.

డా॥ సందీప్ అడికె
MDS (Orthodontics) Asst. Prof. (MIDS)
(క్లిప్స్ స్పెషలిస్ట్)
డా॥ సందీప్ డెంటల్
సెల్: 7207400942, 8919644867
ఉచితంగా అడ్వాన్స్‌డ్ RVG చే దంతాలు స్కాన్ చేసి చూపబడును

గంజాయి విక్రయిస్తున్న ఎక్సైజ్ శాఖ ఉద్యోగి అరెస్ట్

- కిలో ఎండు గంజాయి స్వాధీనం

రామన్నపేట : వరంగల్ బస్టాండ్ ప్రాంతంలో గంజాయి విక్రస్తున్న ఎక్సైజ్ శాఖ ఉద్యోగి మహ్మద్ జబ్బర్ అలీని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఎస్ఐ గాలిబ్ షరీఫ్ వరంగల్ బస్టాండ్ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో పల్సర్ బైక్‌పై గంజాయి సంచితో ఉన్న జబ్బర్ అనుమానాస్పదంగా కనిపించాడు. ఆ సంచిని తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. సంచిలో ఉన్న 1.090 కిలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని విచారించగా మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పినట్లు సీఐ పేర్కొన్నారు. వరంగల్‌లోని ఎల్బీ నగర్ నివాసముంటున్న సదరు ఉద్యోగి జబ్బర్ తన దుబారా ఖర్చుల కారణంగా స్టేషన్‌లో సీజ్ చేసి నిల్వ ఉంచిన ఎండు గంజాయిని దొంగలించి విక్రయించేందుకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐతో పాటు కానిస్టేబుల్ శివకృష్ణ, ఉపేందర్, రాజశేఖర్‌లను కమిషనర్ అభినందించినట్లు సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని బాలిక మృతి

కురవి: ద్విచక్ర వాహనం ఢీకొని బాలిక మృతి చెందినట్లు సీరోలు ఎస్సై విజయ్‌రాంకుమార్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన బత్తుల అవంతిక (11) అనే బాలిక కురవి మండలంలోని నల్లెల్ల గ్రామానికి బంధువుల ఇంటికి వచ్చింది. ఈనెల 3వ తేదీన అవంతిక కిరాణం షాపుకు వెళ్లి వస్తున్న క్రమంలో వంశీకృష్ణ అనే వ్యక్తి బైక్‌తో ఢీకొనడంతో తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి



వంచ మహేందర్ రెడ్డి (ఫైల్)

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని వనపర్తి గ్రామానికి చెందిన కట్టర్ వంచ మహేందర్‌రెడ్డి (34) మంగళవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఎస్ఎస్–7 నంబర్ గల ట్రాన్స్‌ఫార్మర్‌పై ఎగ్ఫీజ్ పోవడంతో ఓ రైతు మహేందర్‌రెడ్డికి ఫోన్ చేయగా దాన్ని సరిచేసేందుకు వనపర్తి సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడు. ఏం పొరపాటు జరిగిందో ఏమో ఆ లైన్‌కు విద్యుత్ సరఫరా జరిగి ఒక్కసారిగా షాక్ గురై కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన రైతులు కాపాడే ప్రయత్నం చేయగా ఫలితం దక్కలేదు. దీంతో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైందంటూ గ్రామస్తులు ఆగ్రహంతో జనగామ–సూర్యాపేట రోడ్డులో వనపర్తి స్టేజీ వద్ద రాస్తారోకో చేశారు. రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌యాదవ్, ఎస్సై చింత రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులతో చర్చించి ట్రాన్స్‌కో డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఏడీ అనిల్‌కుమార్, ఏఈ శంకరయ్యలను పిలిపించారు. గ్రామస్తులు, ట్రాన్స్‌కో అధికారులు చర్చించి రూ.7 లక్షల పరిహారం అందే విధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆన్‌ఆఫ్ బిగించాలని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని మాజీ సర్పంచ్ శ్రీధర్, ఎంపీటీసీ రాజిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.



వనపర్తి స్టేజీ వద్ద రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

అయ్యో.. పాపం..

విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన మహేందర్ రెడ్డి తండ్రి సోమిరెడ్డి అంధుడు కాగా తల్లి వినోద ఇటీవల ప్రమాదంలో గాయపడి కాలు విరిగి లేవలేని స్థితిలో ఉంది. భార్య దివ్య ఆరు నెలల గర్భిణి. మహేందర్‌రెడ్డి చెల్లి స్వర్ణలత వివాహమై అత్తగారి ఇంటికి వెళ్లింది. ఇక ఆ కుటుంబానికి ఉన్న దిక్కు మహేందర్‌రెడ్డి ఒక్కడే. రైతులకు ఏ చిన్న విద్యుత్ సమస్య వచ్చిన వెంటనే వెళ్లి పరిష్కరించేవాడు. ఇలా గ్రామంలోని అందరికీ తలలో నాలుకలా ఉంటూ వస్తున్నాడు. మహేందర్‌రెడ్డి మృతితో బాధిత కుటుంబ సభ్యులకు దిక్కెవరంటూ గ్రామస్తులు కంటతడి పెట్టారు.

ఉల్లెపల్లిలో కౌలు రైతు..



ఎల్లయ్య మృతదేహం

మరిపెడ రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు చేపల వేట కోసం ఏటిలో అమర్చిన విద్యుత్ తీగలు తలిగి ఓ కౌలు రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఉల్లెపల్లి గ్రామ శివారు ఆకేరు వాగులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని ఉల్లెపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు ఆబోతు ఎల్లయ్య (35) గ్రామ శివారు ఆకేరు వాగు ఒడ్డున సాగు చేసిన పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. అక్కడ వాగులో చేపల వేట కోసం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ తీగలను అమర్చారు. విద్యుత్ తీగలకు కాలు తగలడంతో రైతు ఎల్లయ్య షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

కాజీపేట జంక్షన్‌లో అగ్నిప్రమాదం

- రైల్వే యార్డులో నిలిపి ఉన్న బోగి దగ్ధం
- ప్రాథమిక విచారణ ప్రారంభం



బోగిలోని దగ్ధమైన భాగం



దగ్ధమవుతున్న రైలు బోగి

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే యార్డులో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. నిలిపి ఉన్న రైలు బోగి దగ్ధమైంది. రైల్వే యార్డులో ట్రాఫిక్ క్లియర్ కోసం నిలిచి ఉన్న రైళ్ల మధ్యలోని ఓ బోగిలో మంటలు ఎగసిపడటంతో సమీపంలో గల కాజీపేట రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. రైల్వే అధికారులు, స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలోని బోడగుట్ట వైపు గల రైల్వే యార్డులో గూడ్స్ రైళ్లు, సిక్ అయిన కోచ్‌లు, బోగీలను నిలిపి ఉంచారు. ఇటీవల సికింద్రాబాద్ నుంచి వచ్చిన రైలు బోగిని ఆ యార్డులో వేలం కోసం నిలిపి ఉంచారు. మంగళవారం ఉదయం 7 గంటలకు హైటెన్షన్ కరెంట్ తీగలకు కోతి తగలడంతో ఆ కోతి అక్కడికక్కడే కాలి మంటలతో కింద ఉన్న బోగిపై పడింది. దీంతో బోగీలో మంటలు చెలరేగాయి. అప్పటికే దట్టమైన పొగ రావడంతో సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, అగ్నిమాపక సిబ్బంది, రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజిన్ సాయంతో మంటలు అదుపు చేశారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు దగ్ధమైన బోగిని ఆదీనంలోకి తీసుకొని గార్డింగ్ చేశారు. ఈ ఘటనలో రూ.కోట్ల రూపాయల ఆస్తినష్టం వాటిల్లినట్లు సమాచారం.

విచారణ ప్రారంభం

కాజీపేట రైలు బోగి దగ్ధంపై అధికారులు ప్రాథమిక విచారణ ప్రారంభించారు. ఆకతాయిలు ఎవరైన బోగిలోకి ప్రవేశించి సిగరేట్ తాగి పడేశారా.. ఎవరైన కావాలని చేసి ఉంటారా.. కోతి వల్లే ఈ ప్రమాదం జరిగిందా.. ఇంకేమైనా కారణాలతో బోగి దగ్ధమైందా.. అన్న కోణాల్లో విచారణ చేపట్టారు.

గతంలోనూ ఘటనలు..

కాజీపేట రైల్వే యార్డులో గతంలో 2016లో నిలిపి ఉన్న రెండు బోగీలు దగ్ధమయ్యాయి. 2009లో సీఅండ్‌డబ్ల్యూ సిక్‌లైన్‌లో రైలు బోగి, 2006లో ఫాతిమానగర్‌లో వాషింగ్ సైడింగ్‌లో పుష్‌పుల్ బోగీలు, 2008 ఆగస్టు 1న కేసముద్రం–తాళ్లపూసపల్లి మధ్య గౌతమి బోగీలు దగ్ధమయ్యాయి. కాగా ఒక రైలు బోగి జీవిత కాలం 15 సంవత్సరాలు, ఒక బోగి ఖరీదు రూ.8 కోట్ల వరకు ఉంటుందని రైల్వే రిటైర్డ్ నిపుణులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి టీఎస్ఈఈయూ కృషి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ఈఈయూ)–327 కృషి చేస్తోందని యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. మంగళవారం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని యూనియన్ కార్యాలయంలో టీఎస్ ఈఈయూ–327 హనుమకొండ, వరంగల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో నాయకత్వం ఎప్పుడు ముందుంటుందన్నారు. ఆ శాఖ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 6, 7 తేదీల్లో వరంగల్, హనుమకొండ జిల్లాలో యూనియన్ పతాకావిష్కరణ కార్యక్రమం, యూనియన్ జిల్లా సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. 6న నర్సంపేటలో పతకావిష్కరణ, యూనియన్ సమావేశం, 7వ తేదీన హనుమకొండ, వరంగల్‌లో పతాకావిష్కరణ ఉంటుందన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, టీఎస్ఈఈయూ–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనగాల శ్రీధర్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్న భోజన అనంతరం యూనియన్ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లా స్థాయి సమావేశం ఉంటుందన్నారు. యూనియన్ సభ్యులు, విద్యుత్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకుడు ఐలేష్, వరంగల్ కార్యదర్శి మచ్చిన బుచ్చయ్య గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దొనికల సదయ్య, కార్యదర్శి ఓదేలు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో ఇనుగాల శ్రీధర్

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య



మోహన్‌రావు (ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఆరెపల్లికి చెందిన గువ్వాడి మోహన్‌రావు(32) అనే యువ రైతు అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య, పోలీసుల కథనం ప్రకారం.. ఆరెపల్లికి చెందిన మోహన్‌రావు తన మూడెకరాల వ్యవసాయ భూమిలో పంటల సాగుకు రూ.3 లక్షల మేర అప్పు చేసి తీర్చే పరిస్థితి లేకపోవడంతో బాధపడుతూ తాగుడుకు బానిసయ్యాడు. సోమవారం బయటకు వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వచ్చి ఇంటి ఆవరణలో ఉన్న గుర్తుతెలియని పురుగుల మందు తాగి పడిపోగా అతడి భార్య గమనించి 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించింది. మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

విద్యుత్‌వెలుగుల్లో 'కాళేశ్వర ముక్తీశ్వరస్వామి'



ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాల కోసం ఆలయాన్ని మంగళవారం రాత్రి విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో కాళేశ్వరం పరిసరాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. - కాళేశ్వరం

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOTS & HOUSES FOR SALE

■ క్లియర్ టైటిల్ గల ప్లాట్లు & ఇండ్లు అమ్మబడును, కొనబడును (HNK & WGL), Cont: RK Real Estate. Ph: 8977429273. [W-1200994]

షట్టర్ కిరాయికి ఇవ్వబడును

■ మిస్కిండి కాంప్లెక్స్ పర్వతగిరి వరంగల్ వాణిజ్య బ్యాంకు ఆర్థిక కార్యకలాపాలకు షట్టర్స్ కిరాయికి కనీస వసతులు, విశాలమైన కారు పార్కింగ్ కలదు. సంప్ర॥ 9441928908. [W-1200981]

LAND FOR SALE

■ 15వ డివిజన్, మొగలిచెర్ల గ్రామ శివారులో 0.35 గుంటల భూమి అమ్మకమునకు కలదు. రోడ్డు సౌకర్యం కలదు. సంప్ర॥ 9618442828. [WA-13918]

SERVICES

VEHICLE FOR SALE

■ TS 03 FE 9080, 2023 Model Maruti XL-6 Smart hybrid alpha 105LMT, TS 03 FE 4034, 2022 Model KIA Carens Smart Stream G1.4T-GD16MTL Vehicle for sale. Indusind Bank Ltd. 9963009029, 8686863880, 9959343539. [W-1220999]

అద్భుత అవకాశం

■ రోజుకి 5000 నుండి 50 వేల వరకు సంపాదించుకొని అద్భుత అవకాశం. విద్యార్థులు, గృహిణిలు, రిటైర్ పర్సన్స్, LIC ఏజెంట్స్, రియల్ ఎస్టేట్స్, మార్కెటింగ్ పర్సన్స్ మొ॥. 9848214521. [W-1221000]

FINANCE

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1200989]

BUSINESS OFFER

■ మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550808222. [H-787736]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

WANTED

■ స్త్రీ/పురుషులు 6 గురు కావలెను వయస్సు 18-28 లోపు చదువు అనుభవం అవసరం లేదు, ఉచిత వసతి జీతం: 10000-15000. సెల్: 9849916058. WGL. [W-1200995]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059669584. [M-1233869]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం స్త్రీ/పు కావలెను. జీతం : 15-25 వేలు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. సంప్ర. 95027 12418, 90906 12469. [M-1233865]

■ వరంగల్‌లోని గొర్రెకుంట ఏరియా ప్రముఖ వేర్ హౌస్‌లో టాటా ACE టాటా ఏసీ మీద పనిచేయుటకు డెలివరీ బాయ్స్ కావలెను. జీతం 11000/- 4 వీక్లి ఆఫ్ ESI+ PF+ మంచి జీతం. సంప్ర॥ 9092159419 [H-804813]

■ హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18k ఫోన్: 9640258800 / 9640408800. [H-799851]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన తరువాత ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.